క్లుప్తంగా

రేపు శ్రీదేవి కనకదుర్గమ్మ తీర్థం

రంగంపేట: చండ్రేడు గ్రామంలో కొలువైన శ్రీదేవి కనకదుర్గమ్మ వార్షిక తీర్థ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించడానికి గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలదండలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పాఠశాలకు వంట సామగ్రి వితరణ



వంటసామగ్రి అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పెదపూడి: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జి.మామిడాడ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లక్ష్మి, ఉపాధ్యాయురాలు గీత అన్నారు. ఈ పాఠశాలలో 1995 – 96లో పదో తరగతి చదివిన ఎస్.శ్రీలక్ష్మి, డి.శశిరేఖ, పి.జ్యోతి, పి.సునీత, ఎస్.సత్యవేణి, ఎస్.మధు, ఎస్.లలితా సరోజ, నాగలక్ష్మి తదితరులు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామగ్రి, గ్యాస్‌స్టౌ, 100 కంచాలను శుక్రవారం అందజేశారు. సుమారు రూ.60 వేలతో వీటిని సమకూర్చారు.

రేపు యోగా శిక్షణ

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువులో ఆదివారం సేవా ఉగాది సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో యోగా శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామంలోని గోదావరి విద్యాపీఠం ప్రాంగణంలో జరిగే ఈ శిక్షణకు ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు హాజరుకావచ్చని వంకా సూర్య నారాయణ అండ్ సన్స్ తెలిపారు. పీజీ రమణ శిక్షకులుగా వ్యవహరిస్తారన్నారు. పూర్తి వివరాలను 99480 19611 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కంటి పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ శుక్రవారం ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన స్మార్ట్ విజన్ ఐ లాసిక్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మొదటి రోజు సుమారు 400 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా పర్యవేక్షించారు.

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



రఘుదేవపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న శుక్రవారం పరిశీలించారు. ఎంపీపీ స్కూల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మంచి భోజనం అందుతోందన్నారు.

ఈ-కేవైసీతో రైతులకు మేలు



రనీ, ఉద్యానశాఖ అధికారి

మధురపూడి: ఈ-కేవైసీలో నమోదు ద్వారా రైతులకు మేలు జరుగుతోందని, పంటకు బీమా, ప్రభుత్వ రాయితీలు పొందవచ్చని ఉద్యానశాఖ కోరుకొండ మండలాధికారి పి.రనీ తెలిపారు. ఆమె శుక్రవారం బూరుగుపూడి ఆర్బీకేలో విలేకరులతో మాట్లాడారు. కోరుకొండ మండలంలో ఈ-కేవైసీ 91.24 శాతం పూర్తయ్యిందన్నారు. మండలంలో రబీ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానశాఖలకు చెందిన 2,982 మంది రైతులు 8,372.46 ఎకరాలకు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. అలాగే మామిడి, జీడి మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పూత, పిందె దశలోని మామిడి సంరక్షణకు ప్లానోఫిక్స్ 50 ఎంఎల్, ఎసిఫేట్ 300 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడికి తామర పురుగు ఆశించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఉపాధిలో పారదర్శకతకు పెద్దపీట

- జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం వేగవంతం
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 96.31 శాతం పూర్తి

బిక్కవోలు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల జాబ్ కార్డులతో ఆధార్ అనుసంధానం ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఫలితంగా పనుల కల్పన, వేతనాల చెల్లింపు, ఇతర అంశాల్లో పారదర్శకత రానుంది. గతంతో ఒకరికి రెండు జాబ్ కార్డులు ఉన్న ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి, వివాహాలు, ఇతర ప్రాంతాలకు వలసపోయిన సందర్భాలు, మరుగుదొడ్డి, ఇళ్ల నిర్మాణాలు, పనుల కల్పనకు సంబంధించి రెండో జాబ్‌కార్డు పొందిన ఘటనలు అనేక ఉన్నాయి. జాబ్ కార్డుల మంజూరులో తనిఖీలు లేక అదనపు కార్డుల సంఖ్య పెరిగింది.

అక్రమాలకు అడ్డుకట్ట

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలంలోని 1,38,750 మంది కూలీలకు గాను 1,33,486 మందికి ఆధార్ సీడింగ్ (96.31 శాతం) పూర్తయ్యింది. వీటిలో రాజానగరం నియోజకవర్గం

ఆధార్ నమోదు వివరాలు

మండలం	కూలీలు	ఆధార్ సీడింగ్ అయిన సభ్యులు	పూర్తయిన శాతం
అనపర్తి	14,805	14,166	95.68
బిక్కవోలు	20,063	19,100	95.20
రంగంపేట	20,905	20,152	96.39
పెదపూడి	23,188	22,531	97.16
రాజానగరం	25,618	24,472	95.52
సీతానగరం	14,403	14,312	99.36
కోరుకొండ	19,768	18,753	94.87
మొత్తం	1,38,750	1,33,486	96.31



రంగాపురంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

సీతానగరం మండలం 99.36 శాతం, అనపర్తి నియోజవర్గం పెదపూడి మండలంలో 97.16 శాతంతో ముందజలో ఉన్నాయి. గతంలో ఒక కుటుంబంలో తండ్రి, కుమారులు, సోదరులకు ఒక జాబ్ కార్డు ఉండేది. కుమారుడికి వివాహమైతే వేరే జాబ్‌కార్డు పొందేవారు. కుమార్తెకు వివాహమై వేరే ప్రాంతానికి వెళ్లితే మరో జాబ్‌కార్డులో చేర్చేవారు. పాత కార్డులో వీరు పేర్లు మాత్రం తొలగింపు జరగేది కాదు. ఈ క్రమంలో వేతనాల చెల్లింపు, సాంకేతిక సమస్యలతో పాటు పథకాలు దుర్వినియోగమవుతున్నాయనే విమర్శలు వచ్చాయి. ఆధార్ అనుసంధానం ద్వారా అక్రమాలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయవచ్చని కేంద్ర ప్రభుత్వం భావించింది. దీనిద్వారా ఒకటి కంటే ఎక్కువ కార్డుల్లో పేర్లు ఉంటే వాటిని తొలగించనున్నారు.

యాప్‌లో నమోదు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన మార్గదర్శకాల ప్రకారం ఒక కూలీకి పని కల్పించాలంటే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్ (ఎన్ఎంఎంఎస్) నమోదు తప్పనిసరి. గతంలో 20 మందికి పైగా కూలీలకు పని కావాలంటే మాత్రమే ఎన్ఎంఎంఎస్‌లో నమోదు చేసేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికారు. పనుల పర్యవేక్షణ, కల్పన, హాజరులో పారదర్శకత పెరుగుతుందని అధికారుల భావన. సమయం తదితర అంశాల్లో అక్రమాల నిరోధానికి యాప్ దోహదపడుతుంది.

ప్రక్రియ వేగవంతం చేశాం



ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులోని సభ్యులకు ఆధార్ కార్డు అనుసంధానం ప్రక్రియ వేగవంతం చేశాం. దీనిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా పనుల కల్పనలో అంచనాలు, వేతనాల చెల్లింపుల్లో ఇబ్బందులు అధిగమించేందుకు ఇది దోహదపడుతుంది.

– జి.వెంకటేశ్వరరావు, ఏపీవో, బిక్కవోలు

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



లబ్ధిదారుడు శివకు టిప్పర్ అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- లబ్ధిదారుకు టిప్పర్ అందజేత

మధురపూడి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో నిడిగట్లకు చెందిన లబ్ధిదారుడు వేమగిరి శివకు టిప్పర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ శ్రమే సమాజాభివృద్ధికి మూలమని, కష్టాన్ని నమ్మిన జగనన్న ఎస్సీ, ఎస్టీల వికాసానికి నాంది పలికారన్నారు. ఎస్సీ, ఎస్టీలు వాణిజ్యవేత్తలుగా అభివృద్ధి చెందడానికి వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల గంగా సురేష్, అడపా అనిల్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో సమన్యాయం

- అన్ని వర్గాలకూ భాగస్వామ్యం
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమైందన్నారు. తాజాగా ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 స్థానాలను బీసీలకు కేటాయించారని, ఇన్ని స్థానాలు బీసీలకు కేటాయించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారన్నారు. దీనిద్వారా బీసీలు అంటే కేవలం ఓటు బ్యాంకు అని కాకుండా రాష్ట్రానికి వెన్నుదన్ను అంటూ సీఎం జగన్ స్పష్టం చేశారని అన్నారు. మిగిలిన స్థానాల్లో రెండు ఎస్సీ, ఒకటి ఎస్టీలకు కేటాయించిన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 36 ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించగలిగితే వారిలో 25 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులే ఉన్నారన్నారు. అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పిస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు.

మెట్టలో జోరుగా మినుము తీత



రంగంపేటలో మినుము పంటకు స్ప్రింకర్లతో నీరు అందిస్తున్న రైతులు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేటలో రబీ సీజన్‌లో రైతులు సుమారు 1,250 ఎకరాల్లో శనగ, 600 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో ఈ పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. కొద్ది రోజులుగా రైతులు ఈ పంటల తీతను ప్రారంభించారు. కొందరు కూలీల సహాయంతో పంట తీతను ప్రారంభించి కుప్పలు వేస్తుండగా, మరి కొందరు మెషీన్లను ఉపయోగించి పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. గత సార్వా సీజన్‌లో రైతులు ఎక్కువగా మినుము సాగుచేయగా, పంటతీత దశలో అధిక వర్షాలు కురవడంతో రైతులు నష్టపోయారు. కాగా లేటుగా వేసిన మినుము సాగుకు ఎండలు పెరగడంతో స్ప్రింకర్లతో నీటి తడులు అందిస్తున్నారు. ఈ సీజన్ శనగ, మినుము పంటలు బాగుండటంతో దిగుబడి బాగా రావచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్యాన్సర్‌పై వైద్య సిబ్బందికి అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్లు సూర్యప్రభ, సూర్యారావు

గోకవరం: మండలంలోని జి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి క్యాన్సర్ వ్యాధిపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సూర్య ప్రభ, వి.సూర్యారావు క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం, వ్యాధి తీవ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 30 సంవత్సరాలు దాటిన స్త్రీలలో గైనిక్, రిప్రొడక్టివ్ ట్రాక్ ఇన్ఫెక్షన్స్, పొగతాగడం, మద్యం సేవించడం, పొగాకు నమలడం వంటి అలవాట్లు ఉన్నవారిలో క్యాన్సర్ గుర్తించడంపై వైద్యులకు వివరించారు. మార్చి 2న గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ కేసులను స్క్రీనింగ్ చేస్తారని, అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మేరీ కృప, ఎంపీహెచ్ఈఓ రాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఓబుల్‌రెడ్డి

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జి.మామిడాడ రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లమిల్లి గణేష్ సత్య వెంకటరెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం చిన్నారులకు గుండె స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణుడు జి.ఓబుల్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి శిబిరానికి వచ్చిన సుమారు 112 మంది చిన్నారులకు గుండె వైద్య పరీక్షలు చేశారు. వారిలో ముగ్గురికి సమస్యలు ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఓబుల్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో నల్లమిల్లి సుభాష్ రెడ్డి, పడాల సూరారెడ్డి, పడాల శ్రీధర్‌రెడ్డి, భీమన రామ్మూర్తి, నల్లమిల్లి సతీష్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగనన్న భూసర్వే

సీతానగరం: మండల రెవెన్యూ గ్రామాల్లో జగనన్న భూసర్వే కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సత్యనారాయణ రాజు విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాల్లో భూసర్వే జరుగుతోందని, భూముల విషయంలో ఏ సమస్యలున్నా సంబంధిత వీఆర్వోలకు తెలియజేయాలన్నారు. అలాగే రైతులు తమ భూములకు సంబంధించిన దస్తావేజులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఆధార్ జిరాక్స్‌లను వీఆర్వోలకు అందించాలన్నారు. దీనితో జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు పొందవచ్చని తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి అభినందనలు



ప్రసన్న భార్గవిని అభినందిస్తున్న హెచ్ఎం పైడిరాజు

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భూడి ప్రసన్న భార్గవి బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపుతోంది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో ఈనెల 16 నుంచి 22 వరకూ జరిగిన 41వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించింది. ఆ టోర్నీలో మన రాష్ట్రం ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో ప్రసన్న భార్గవిని శుక్రవారం పాఠశాలలో హెచ్ఎం పైడిరాజు అభినందించారు. కార్యక్రమంలోని పీడీ కేఎల్ నాగమణి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పన వీరభద్ర స్వామి, కార్యదర్శి ముప్పన వీర్రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీకేఆర్ తంబి, బిక్కవోలు బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శి టి.చైతన్యకుమార్ రెడ్డి, పాఠశాల పీఈటీ నరేంద్ర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



కొమరిపాలెంలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేసినట్లు అక్షయ సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కొమరిపాలెంలోని శ్రీరామ్ పబ్లిక్ స్కూల్లో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులు తాము తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. తొస్సిపూడి ఎంపీటీసీ సభ్యురాలు తేతలి సుమ మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28 లోపు రబీ ఈ-క్రాప్ పూర్తి కావాలి



అనపర్తి ఆర్బీకేలో ఈ -క్రాప్ వివరాలు తెలుసుకుంటున్న డీడీ బోసుబాబు, ఏడీఏ కృష్ణ

అనపర్తి: రబీ ఈ-క్రాప్ నమోదు ఈనెల 28వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ బోసుబాబు ఆదేశించారు. పులగుర్త, అనపర్తి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఏడీఏ డీవీ కృష్ణతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఆర్బీకేల్లో జరుగుతున్న పంట నమోదు, రైతు భరోసా మాసపత్రికలు, వ్యవసాయ యాంత్రీకరణలో పెండింగ్‌లో ఉన్న గ్రూపులపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు, పంటరుణాలపై సున్నావడ్డీ, రైతు భరోసా తదితర ఆర్థిక వెసులుబాటు కల్పించే పథకాలను ఈ -క్రాప్ ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయాధికారి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

25 నుంచి గోదావరి బాలోత్సవం

ప్రకాశం నగర్: స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో ఈనెల 25, 26 తేదీల్లో గోదావరి బాలోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ రాజు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 200 పైగా పాఠశాలల నుంచి నాలుగు వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అకాడమిక్, కల్చరల్ భాగాలుగా విభజించి 60 పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిశీలన

గోకవరం: గంగాలమ్మ గుడి వెనుక పోలవరం ముంపు బాధితుల కోసం నిర్మిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని 522 గృహాలను పోలవరం ముంపు నిర్వాసితులు శుక్రవారం పరిశీలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గంలోని పోలవరం ముంపు నిర్వాసితుల కోసం ప్రభుత్వం గోకవరంలో గృహాలు నిర్మిస్తోంది. వీటిని నిర్వాసితులు పరిశీలించి గృహాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

స్థలం కేటాయించాలి

సీటీఆర్ఐ: అంధ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న జియోన్ స్కూల్‌కు జీవకారుణ్య సంఘం ప్రాంగణంలో స్థలం కేటాయించాలని రాజమహేంద్రి గోదావరి సంరక్షణ సమితి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జియోన్ స్కూల్‌ను తరలించే విషయంలో వారికి న్యాయం చేయాలన్న దానిపై ప్రతి ఒక్కరు మద్దతు ఇస్తారన్నారు. అయితే నగరానికి ప్రభుత్వ వైద్య కళాశాల రావడం అనేది చాలా ప్రతిష్ఠాత్మక మన్నది ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. జియోన్ స్కూల్ తరలింపు చాటున వివిధ రాజకీయపార్టీలకు సంబంధించిన నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేయడం అనేది సరికాదన్నారు. సమావేశంలో చైర్మన్ బర్రే కొండబాబు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ఏడాది జైలు

ధవళేశ్వరం: వ్యక్తిపై దాడి కేసులో ధవళేశ్వరం గ్రామానికి చెందిన వెంపాడ దుర్గారావుకు ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 7వ అదనపు కోర్టు జడ్జి రామకృష్ణ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ధవళేశ్వరం సీఐ మంగాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. 2019 జూన్ 18న దారపు బంగారయ్యను వెంపాడ దుర్గారావు మసాలా నూరుకొనే రాయితో కొట్టి గాయపరిచాడు. దీనిపై అప్పటి ఏఎస్సై కె.నాగరాజు కేసు నమోదు చేశారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం

- కలెక్టర్ డాక్టర్ మాధవీలత
- ఉత్సాహంగా ఆర్ఎంసీ కప్ పోటీలు



గాలిలోకి బెలూన్లు వదిలి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న నగరపాలక సంస్థ ఉద్యోగులు



క్రీడాజ్యోతితో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

ప్రకాశం నగర్: ఉద్యోగులు విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల అథ్లెటిక్ క్రీడామైదానంలో ఆర్ఎంసీ కప్ -2023 క్రీడాపోటీలను శుక్రవారం కలెక్టర్ మాధవీలత, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ప్రారంభించారు. క్రీడా జ్యోతితో కలెక్టర్, కమిషనర్, ఇతర నగరపాలక సంస్థ అధికారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో శానిటేషన్, వాటర్ సప్లై, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, వైద్యం, పరిపాలన తదితర విభాగాలకు సంబంధించి సుమారు 6 వేల మంది ఉద్యోగులు నిత్యం ఎంతో ఒత్తిడి మధ్య విధులను నిర్వర్తిస్తున్నారన్నారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఆర్ఎంసీ కప్ -2023 పేరుతో క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఆదివారం వరకూ మూడు రోజులు జరిగే ఈ పోటీల్లో నగరపాలక సంస్థ వివిధ విభాగాల నుంచి 523 మంది పాల్గొంటున్నారన్నారు. అనంతరం జెండా ఊపి వంద మీటర్ల రన్నింగ్ పోటీలను ప్రారంభించారు. డిప్యూటీ కమిషనర్లు పి.సత్యవేణి, జి.సాంబశివరావు, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, జిల్లా క్రీడాధికారి శేషగిరిరావు పాల్గొన్నారు.

మొదటి రోజు పోటీలు

టెన్నికాయిట్ (మహిళలు), బ్యాడ్మింటన్ డబుల్స్ (పురుషులు), బ్యాడ్మింటన్ డబుల్స్ (మహిళలు), బ్యాడ్మింటన్ సింగిల్ (పురుషులు), బ్యాడ్మింటన్ సింగిల్ (మహిళలు), కబడ్డీ (పురుషులు), క్యారమ్స్ సింగల్ (పురుషులు), చదరంగం సింగల్ (పురుషులు), క్యారమ్స్ డబుల్ (పురుషులు), క్యారమ్స్ సింగల్ (మహిళలు), వాలీబాల్ సింగిల్ (పురుషులు), ఖోఖో (మహిళలు) విభాగంలో తొలిరోజు పోటీలు జరిగాయి.